సాక్షి
అనంతపురం

శనివారం ׀ 13 ׀ జనవరి ׀ 2024



ఎన్నికల కసరత్తు మొదలాయె

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. సిబ్బందికి శిక్షణిచ్చేందుకు చర్యలు చేపట్టింది. 8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం అమ్మకాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
33.6°/ 14.2°

జిల్లాలో ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

పందేలు ఆడితే చర్యలు

• ఎస్పీ అన్బురాజన్



అనంతపురం క్రైం: సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్బురాజన్ హెచ్చరించారు. జూద క్రీడలు వద్దు.. సంప్రదాయ ఆటలు ముద్దు అని సూచించారు. కోడి పందేలు ఆడేవారిని, కోడి కత్తుల తయారీదారులు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. పల్లెల్లో కూడా గట్టి నిఘా ఉంచామన్నారు. కోడి పందేలు, జూదాల వల్ల సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశ పడి భారీగా నష్టపోతున్నారన్నారు. దీనివలన ఆయా కుటుంబాలు పండుగ పూట ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. ఎవరైనా జిల్లాలో కోడి పందేలు నిర్వహించినా, పందేలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత ఇటువంటి కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు అధోగతి పాలవుతాయని హెచ్చరించారు. ఎక్కడైనా కోడిపందేలు, జూదం ఆడితే పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100, 112 లేదా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు

శాంతిభద్రతల పరిరక్షణ నేపథ్యంలో పోలీసు శాఖ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో ముమ్మర తనిఖీలు చేపట్టింది. రోడ్డు భద్రత నిబంధనల ఉల్లంఘన, ట్రిపుల్ రైడింగ్, నంబర్ ప్లేటు, రికార్డులు సరిగా లేని వాహనాలు, ర్యాష్ డ్రైవింగ్ వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ జిల్లా సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు కొనసాగుతాయని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. లాడ్జీలు, హోటళ్లు, ధాబాలపై నిరంతరం తనిఖీలు ఉంటాయన్నారు. అనుమానిత వ్యక్తులు, అసాంఘిక శక్తులపట్ల నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

రూ. 8 లక్షల్లోపు ఆదాయం ఉంటేనే 'నాన్‌క్రిమీలేయర్'

అనంతపురం రూరల్: సంవత్సరానికి రూ. 8 లక్షల ఆదాయం కంటే తక్కువ ఉన్న ఓబీసీ ఉద్యోగులు నాన్ క్రిమీలేయర్ సర్టిఫికేట్‌కు అర్హులని బీసీ సంక్షేమశాఖ అధికారి కుష్బూకొఠారి ఓ ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వేతనాల ద్వారా వచ్చే ఆదాయం సంవత్సరానికి రూ. 8 లక్షల కంటే ఎక్కువగా ఉండి వ్యవసాయ భూమి నుంచి వచ్చే ఆదాయం ఏడాదికి రూ. 8 లక్షలు ఉన్నా ఇతర వనరుల నుంచి 8 లక్షల కంటే తక్కువగా ఉంటే ఇన్‌కమ్ వెల్త్ టెస్ట్ ఆధారంగా అభ్యర్థి క్రిమీలేయర్‌గా పరిగణించబడరన్నారు. వరుసగా మూడు సంవత్సరాల పాటు సంపద పన్ను చట్టం నిర్దేశించిన మినహాయింపు పరిమితికి మించి సంపదను కలిగి ఉండకూడదన్నారు. తల్లిదండ్రులిద్దరూ నేరుగా క్లాస్-11, గ్రూప్-బి, గ్రూప్-2లో నియమితులైతే క్లాస్-1, గ్రూప్-1కి తదుపరి ప్రమోషన్‌తో సంబంధం లేకుండా వారి పిల్లలు క్రిమీలేయర్ కిందకు వస్తారన్నారు. సర్వీస్ కేటగిరి కింద ఉన్న, పబ్లిక్ అండర్ టేకింగ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ వెంచర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలు నాన్ క్రిమీలేయర్ సర్టిఫికేట్‌కు అర్హులవుతారన్నారు.

16న పాలసముద్రానికి ప్రధాని మోదీ!



నాసిన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి తదితరులు

పెనుకొండ/గోరంట్ల: ప్రధాని నరేంద్ర మోదీ శ్రీసత్యసాయి జిల్లా పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) ప్రారంభోత్సవానికి ఈ నెల 16న ప్రధాని హాజరయ్యే అవకాశముంది. అయితే దీనిపై ఇప్పటి వరకూ అధికారిక సమాచారం లేనప్పటికీ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శుక్రవారం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ నాసిన్‌లో పర్యటించారు. సంస్థ అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్, వీఐపీ గ్యాలరీ ఏర్పాట్లను చూశారు. అసంపూర్తిగా ఉన్న పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో నాసిన్ సంస్థ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సుందర అనంత

విశాలమైన వీధులు.. విస్తరించిన రోడ్లు.. నూతన ఫ్లై ఓవర్లు ఎల్ఈడీ లైట్లు.. ఎటు చూసినా పచ్చదనంతో అనంతపురం నగరం ఎంతో సుందరంగా కనిపిస్తోంది. గడిచిన నాలుగున్నరేళ్లలో నగర ముఖచిత్రమే మారిపోయింది. ఒకప్పుడు కుచించుకుపోయిన రోడ్లు, గుంతలమయమైన వీధులు కనిపించేవి. నేడు ప్రతి వీధిలోనూ సీసీ రోడ్లు కనిపిస్తున్నాయి. ఇక ఫ్లై ఓవర్ బ్రిడ్జీలు నగరానికి మకుటాయమానంగా నిలిచాయి.

- గుండం రామచంద్రారెడ్డి, సాక్షి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం నగరంలో టవర్‌క్లాక్ వద్ద నూతనంగా నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి

• నాలుగున్నరేళ్లలో మారిన రూపురేఖలు • కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు • రూ.311 కోట్లతో 9.2 కిలోమీటర్ల బ్రిడ్జి కమ్ రోడ్డు
• గుత్తిరోడ్డు విస్తరణతో నగరానికి నూతన శోభ • సర్వజనాస్పత్రిలో ఆధునిక వసతులు • 'గడప గడపకూ మన ప్రభుత్వం'తో గల్లీల్లోనూ సీసీ రోడ్లు



పాతూరులో ఛాతి వ్యాధుల ఆస్పత్రి నూతన భవనం

ఆస్పత్రుల ఆధునికీకరణ

• ఇదివరకు అసౌకర్యాలు, మందులు, సిబ్బంది కొరత కారణంగా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటేనే మనసు చివుక్కుమనేది. ఇప్పుడు ప్రైవేటు ఆస్పత్రికి దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దారు. అనంతపురం సర్వజనాస్పత్రిలో ఆధునికీకరణ పనులు, కార్పొరేట్‌కు దీటుగా ఉండే పట్టణ ఆరోగ్య కేంద్రాలతో వైద్య సేవలు మరింత మెరుగయ్యాయి.

బోధనాస్పత్రి బలోపేతం

• జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి అభివృద్ధికి 'నాడు-నేడు' కింద ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించింది. 560 పడకలున్న ఆస్పత్రిని 1,200 పడకలకు మార్చేలా సర్జికల్ బ్లాక్, ఎంసీహెచ్ బ్లాక్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
• సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులో రావడానికి ప్రభుత్వ వాటా రూ.30 కోట్లను విడుదల చేయడంతో స్పెషాలిటీ సేవలు ప్రారంభమయ్యాయి.
• రూ.23.75 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో క్రిటికల్ కేర్ బ్లాక్ పనులు జరుగుతున్నాయి.
• అనంతపురంలో మొత్తం 10 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి.



నూతనంగా నిర్మిస్తున్న సర్వజనాస్పత్రి సర్జికల్ బ్లాక్



ఎన్టీఆర్ మార్గ్‌కు నూతన శోభ



అనంతపురం నియోజకవర్గ పరిధిలో మచ్చుకు కొన్ని అభివృద్ధి పనులు

టవర్ క్లాక్ బ్రిడ్జి-రోడ్డు పనులకు	రూ.311 కోట్లు
గుత్తి రోడ్డు విస్తరణ పనులు	రూ.96 కోట్లు
పట్టణ ఆరోగ్య కేంద్రాలకు	రూ.6 కోట్లు
సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి	రూ.30 కోట్లు
మైనర్ బ్రిడ్జీల నిర్మాణానికి	రూ.21 కోట్లు
సచివాలయాల పరిధిలో పనులకు	రూ.14.58 కోట్లు

రూ.21 కోట్లతో మైనర్ బ్రిడ్జీలు

• నగరంలో 40 ఏళ్ల నాటి బ్రిడ్జీలు శిథిలదశకు చేరుకున్నాయి. అమృత్ స్కీం కింద రూ.21 కోట్లతో మహాత్మాగాంధీ కాలనీ, వేణుగోపాల్‌నగర్, అశోక్‌నగర్, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, త్రివేణి థియేటర్, తపోవనం బ్రిడ్జీలతో పాటు 1.4 కిలోమీటర్ల మేర సైడ్ వాల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



సూర్యా నగర్‌లో నిర్మించిన సిమెంట్ రోడ్డు

ముంగిటకే సేవలు

▸ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ-వలంటీర్ వ్యవస్థ ద్వారా సాకారం చేశారు. ఇదివరకు పనులు, ధ్రువీకరణ పత్రాలు తదితర వాటి కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో గంటల తరబడి వేచిచూసే పరిస్థితి ఉండేది. నేడు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకు చేరాయి. అనంతపురం నియోజకవర్గంలో 85 సచివాలయాలు ఉన్నాయి. ప్రభుత్వ సేవలు నిర్దిష్ట గడువులోపు అందుతుండటం, అవినీతి, లంచాలకు తావులేకుండా పోవడంతో ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతోంది.
▸ హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని అనంతపురం ఉండటంతో ఇక్కడ స్థిరాస్తి, ఉద్యోగ, వ్యాపార వర్గాలు పెట్టుబడులకు వస్తుండటంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.
▸ నాడు - నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనులతో పాటు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కింద రోడ్లు, కొళాయిలు ఇలా పలు రకాల అభివృద్ధి పనులు జరిగాయి.

అభివృద్ధి పరుగులు పెట్టించిన తీరు

- నగరంలో రూ.311.93 కోట్ల కేంద్రం నిధులతో అర్బన్ లింక్ ప్రాజెక్ట్ కింద నూతన రైల్వే ఓవర్ బ్రిడ్జ్, బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకు (9.2 కిలోమీటర్లు) రోడ్డు వేయాలని నిర్ణయించారు. 2021 అక్టోబర్ 25న మొదలైన బ్రిడ్జి పనులు 2023 అక్టోబర్ 24న పూర్తయ్యాయి. రైల్వే అండర్ పాస్, రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి.
- గుత్తి రోడ్డు కనకదాస విగ్రహం నుంచి తడకలేరు వరకు రూ.96 కోట్లతో ఇరువైపులా విశాలమైన రోడ్డు, మేజర్, రెండు మైనర్ బ్రిడ్జీలు ఏర్పాటు చేశారు.
- సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లతో నగరంలోని 50 డివిజన్లు కవరయ్యేలా 19 ప్యాకేజీల్లో పనులు చేయాలని నిర్ణయించారు. అందులో రూ.8 కోట్ల పనులు పూర్తయ్యాయి.
- నగర పాలక సంస్థ నిధులు రూ.124.73 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో 185 రోడ్లు, 185 కాలువలు నిర్మిస్తున్నారు. వీటిలో 80 శాతం పనులు పూర్తయ్యాయి.
- నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.28.08 కోట్లతో నగరంలోని వివిధ డివిజన్లలో పెద్ద ఎత్తున రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశారు.
- నాడు-నేడు మొదటి దశ నిధులు రూ.4.96 కోట్లు, రెండో దశ రూ.10.51 కోట్లతో నగరంలోని వివిధ ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మార్చేశారు.



రాజీవ్ కాలనీలో నిర్మించిన బ్రిడ్జి

చాలా మార్పులు వచ్చాయి



గతంతో పోల్చితే ప్రస్తుతం నగరంలో విశాలమైన రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపడింది. ముఖ్యంగా రైల్వే ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య చాలా తగ్గింది. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సేవలు మెరుగుపర్చడంతో పాటు సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకురావడం అందరికీ చాలా ఉపయోగకరం. బెంగళూరు, హైదరాబాద్, కర్నూలులాంటి ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే కార్పొరేట్ స్థాయి సేవలందుతున్నాయి. 'నాడు-నేడు' ద్వారా ప్రభుత్వ స్కూళ్లనూ కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు.

- ఎం లహరి, అనంతపురం

రూపురేఖలు మారిపోయాయి



ప్రధాన నగరాల తరహాలో అనంతపురం రూపురేఖలు మారిపోయాయి. ముఖ్యంగా టవర్‌క్లాక్ ఓవర్ బ్రిడ్జ్ జిల్లాకే తలమానికం. సకాలంలో బ్రిడ్జి నిర్మించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపారు. ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయడం ద్వారా జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతోంది. నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మేలును మరువలేం.

- వినయ్, అనంతపురం

ప్రభాకర్‌రెడ్డికి ఇక నిద్రలేని రాత్రులే

• న్యాయవాది శ్రీనివాసులు హెచ్చరిక

తాడిపత్రి అర్బన్: మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సంస్కారహీనుడని ప్రముఖ న్యాయవాది వై.శ్రీనివాసులు ధ్వజమెత్తారు. మర్యాద ఇచ్చి పుచ్చుకోవడం ఏమాత్రమూ తెలియదన్నారు. మహిళలంటే ఏమాత్రమూ గౌరవం లేదన్నారు. నైతిక విలువలు ఏ కోశానా కనిపించవన్నారు. తన కుటుంబంపై అవాకులు చెవాకులు పేలిన ప్రభాకర్‌రెడ్డి ఇక నుంచి నిద్రలేని రాత్రులు గడపాల్సిందే అని హెచ్చరించారు. శుక్రవారం తాడిపత్రిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తన కూతురి పెళ్లి విషయంలో అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ప్రభాకర్‌రెడ్డికి మహిళలంటే ఏమాత్రమూ గౌరవం లేదన్నారు. ఎందుకు నోరు పారేసుకున్నానా అని పశ్చాత్తాప పడేలా తగిన బుద్ధి చెబుతానన్నారు. అదే వారి కుటుంబం గురించి తాము మాట్లాడితే ఊరుకుండేవారా అని ప్రశ్నించారు. ఎదుటి వ్యక్తితో ఎలా మాట్లాడాలి.. ఎలా ప్రవర్తించాలో తెలుసుకుని మసలుకోవాలని హితవు పలికారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీనివాసులు

మోసాలు చేయడంలో ప్రభాకర్‌రెడ్డి దిట్ట

మోసాలు చేయడంతో పాటు తప్పుడు కేసులు బనాయించి వేధించడంలో ప్రభాకర్‌రెడ్డి దిట్ట అని న్యాయవాది శ్రీనివాసులు అన్నారు. బీఎస్- 4 వాహనాల కేసులో కోర్టులో ఉన్న చార్జిషీట్‌లను జూనియర్ న్యాయవాదుల సాయంతో దొంగిలించి, అందులోని ఒరిజినల్ డాక్యుమెంట్లు మాయం చేసిన ఘనుడన్నారు. అదే జూనియర్ న్యాయవాదుల ద్వారా తిరిగి వాటిని కోర్టులో ఉంచిన ఘరానా దొంగ అని విమర్శించారు. బీఎస్-4 వాహనాల కేసులో ఆయన అరెస్టు అక్రమమేమీ కాదన్నారు.

అమాయకులను కేసుల్లో ఇరికించారు

ప్రబోధానందస్వామి ఆశ్రమం వద్ద జరిగిన ఘర్షణల్లో సూత్రధారి అయిన జేసీ ప్రభాకర్ రెడ్డి పేరు కేసుల్లో ఎక్కడా లేదని, అమాయకులను కేసులో ఇరికించారని న్యాయవాది ధ్వజమెత్తారు. జేసీ అనుచరుడు ఎస్వీ రవీంద్రారెడ్డి సూచనల మేరకు టీడీపీలోని అమాయకులను కేసుల్లో ఇరికిస్తున్నారని, ఈ విషయాన్ని ఆ పార్టీ కార్యకర్తలు, అనుచరులు తెలుసుకోవాలని సూచించారు. జేసీ, ఎస్వీ రవీంద్రారెడ్డి చిట్టా అంతా తన దగ్గరుందని, రోజూ వారి గుట్టు విప్పుతానని చెప్పారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం పట్టివేత

కంబదూరు: భారీగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సెబ్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఆ వివరాలను వెల్లడించారు. కుందుర్పి మండలంలోని మహంతపురం–మందలపల్లి గ్రామాల మధ్య వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. టాటాఏస్ (ఏపీ02టీసీ6331) వాహనం ద్వారా కర్ణాటక రాష్ట్రం లింగనహళ్లి నుంచి మందపల్లికి అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని గుర్తించామన్నారు. 72 బాక్సుల్లో హైవార్డ్స్ బ్రాండ్‌కు చెందిన 6,912 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. డ్రైవర్ ఓబులేసును అదుపులోకి తీసుకోగా.. మర్రిస్వామి, మల్లి, కామన్నలతో పాటు మరో వ్యక్తి పరారైనట్లు పేర్కొన్నారు. త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేస్తామన్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.2,95,200 ఉంటుందన్నారు. సమావేశంలో సెబ్ సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్‌ఐ పవన్‌కుమార్, సెబ్ సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీకి పండుగ

- సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికులతో బస్టాండ్ల కిటకిట
- ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు ప్రత్యేక సర్వీసులు
- తెలంగాణ కన్నా ఎక్కువ బస్సులు నడుపుతున్న ప్రభుత్వం

అనంతపురం సెంట్రల్: సంక్రాంతి పండుగ వచ్చిందంటే ప్రతి ఒక్కరూ సొంతూళ్లకు వెళ్తుంటారు. విద్యా, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో వివిధ పట్టణాల్లో స్థిరపడిన వారు సొంతూళ్లకు వస్తున్నారు. దీంతో ఏపీఎస్ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. పూర్తిస్థాయిలో రిజర్వేషన్‌లతోనే కొన్ని సర్వీసులు నడుస్తుండగా.. మరికొన్ని ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని అధికారులు నడుపుతున్నారు. ఎక్కువ మంది హైదరాబాద్, బెంగళూరు పట్టణాల్లో స్థిరపడ్డారు. అక్కడి నుంచి వచ్చే వారి కోసం గతంలో తెలంగాణ, కర్ణాటక సర్వీసులే అధికంగా ఉండేవి. కానీ ఈ సారి ఏపీఎస్ఆర్టీసీనే అత్యధికంగా బస్సులను నడుపుతుండటం గమనార్హం. ముఖ్య నగరాల నుంచి జిల్లాలో ప్రతి డిపోకు బస్సులు నడుపుతున్నారు.

హైదరాబాద్ నుంచే అత్యధికం

సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చే వారికోసం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. హైదరాబాద్, బెంగళూరు, బెంగుళూరు–విజయవాడ, విజయవాడ, చెన్నై, నెల్లూరు నుంచి జిల్లాకు బస్సులను కేటాయించారు. మూడురోజుల పాటు హైదరాబాద్ నుంచి 56 బస్సులు, బెంగళూరు నుంచి 29, బెంగళూరు–విజయవాడకు 7, విజయవాడ నుంచి 6, చెన్నై నుంచి 5, నెల్లూరు నుంచి 2 సర్వీలను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఒక్కరోజే హైదరాబాద్ నుంచి 16 బస్సులు రిజర్వేషన్ కాగా మరో 7 సర్వీసులు (నాన్ రిజర్వేషన్) ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని నడిపారు. దీన్ని బట్టి చూస్తే సొంతూళ్లకు ఏస్థాయిలో ప్రజలు వస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.



అనంతపురం బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా..



"సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నాం. ప్రతి నగరం నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం అన్ని డిపోలకు బస్సులను ఏర్పాటు చేశాం. రద్దీ ఉంటే అదనంగా సర్వీసులు నడిపేందుకు కూడా ఏర్పా ట్లు చేశాం. ఇదేస్థాయిలో ఈనెల 16 తర్వాత తిరు గు ప్రయాణికుల కోసం కూడా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. – సుమంత్ ఆర్ ఆదోని, జిల్లా ప్రజారవాణా అధికారి

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మృతుడు ఓంకేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

కుందుర్పి: కర్ణాటక రాష్ట్రంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్రగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంపీటీసీ కవిత భర్త ఓంకేష్ (రాయుడప్ప) మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు ... కర్ణాటకలోని హుబ్లీ సమీపంలోని రాణిబెన్నూరులో ఓంకేష్ పాత బైకు కొనుగోలు చేసి సాయంత్రం తిరిగి బైకులో స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓంకేష్ మృతి చెందాడన్నారు. మృతునికి ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి తదితరులు శుక్రవారం ఎర్రగుంటకు వెళ్లి నివాళులర్పించారు. ఎంపీతో పాటు జెడ్పీటీసీ రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రీ, సింగిల్ విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మారణాయుధాలను చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం: నగరంలోని బుడ్డప్పనగర్‌లో అశోక్ బాబు అనే వ్యక్తిపై హత్యాయత్నం కేసులో పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కత్తి, సుత్తి, కారంపొడి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సీఐ రెడ్డెప్ప విలేకరులకు తెలిపారు. స్థానిక తారకనాథ్ కాలనీలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవరు అశోక్ బాబు తన సొంత పెద్దమ్మ కుమారుడైన గోవిందురాజులు నుంచి అవసరాల నిమిత్తం డబ్బు తీసుకున్నాడు. ఇతరుల నుంచి కూడా గోవిందురాజులు అశోక్‌కు అప్పుగా ఇప్పించాడు. కాగా తీసుకున్న డబ్బును తిరిగి చెల్లించకపోగా డబ్బు వెనక్కి ఇచ్చేది లేదని తెగేసి చెప్పాడు. అశోక్‌తో గొడవపడటం ఇష్టం లేక ఎలాగైనా కసి తీర్చుకోవాలని పగతో గోవిందురాజులు రగిలిపోయాడు. ఇందులో భాగంగా ఓ మైనర్‌ని వెంటబెట్టుకుని కత్తి, సుత్తి తీసుకుని పక్కా ప్లాన్‌తో ఇంటికి వెళ్లి అశోక్‌బాబును తన బండిలో వెంట తీసుకెళ్లాడు. పథకం ప్రకారం అశోక్‌కు పీకలదాక మద్యం తాపించి కళ్లలో కారం చెల్లి అనంతరం సుత్తి, కత్తితో దాడి చేశారు. తను చనిపోయాడనుకుని అక్కడి నుంచి పరారయ్యారు. నగర శివారుల్లోని జేఎన్‌టీయూ సమీపంలో ఇద్దరు అనుమానితులను అదుపులోకి విచారణ చేపట్టిన పోలీసులకు అశోక్‌పై దాడి చేసిందే వారేనని గుర్తించారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



మార్కెట్లోకి 'ఎంజీ ఆస్టర్' కారు



కారును ఆవిష్కరిస్తున్న షోరూం నిర్వాహకులు

తిరుచానూరు(చంద్రగిరి): చెన్నై – బెంగళూరు రహదారి తిరుచానూరు సమీపంలోని కెశ్విన్ ఆటో మోటర్స్ షోరూంలో శుక్రవారం సాయంత్రం నూతన ఎంజీ ఆస్టర్–2024 వాహనాన్ని షోరూం అధినేత ఉదయ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతితో పాటు కర్నూలు, అనంతపురం, నెల్లూరులోని తమ బ్రాంచుల్లో ఒకేసారి ఈ కారును మార్కెట్‌లోకి తీసుకురావడం జరిగిందన్నారు. వాహన ప్రారంభ ధర రూ.9.98 లక్షలు ఉందన్నారు. ఏడీఎస్ఎస్–ఎల్2 ఫీచర్లతో పాటు 49 సేఫ్టీ ఫీచర్స్, అతి పెద్ద సన్‌రూఫ, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ చార్జింగ్ వంటి ఫీచర్లు కారులో పొందుపరిచినట్లు చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఎంజీ కొనుగోలుపై గోల్డ్‌కాయిన్‌తో పాటు రూ.2 లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సుబ్రమణ్యం, నందాని బాషా, యూబీఐ చీఫ్ మేనేజర్లు శేషసాయి, రాకేష్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

తాడిపత్రి అర్బన్: అభం శుభం తెలియని ఆరేళ్ల చిన్నారిపై ఓ కామాంధుడు లైంగిక దాడి యత్నించిన సంఘటన తాడిపత్రి అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. పట్టణంలోని పాలెంకు చెందిన అమర్‌నాథ్‌రెడ్డి (35) చెప్పుల షాపులో గుమాస్తాగా పనిచేస్తుండేవాడు. శుక్రవారం అమర్‌నాథ్‌రెడ్డి తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న బాలిక (6)ను ఇంట్లోకి పిలిచి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమర్‌నాథ్‌రెడ్డిపై పోక్సో కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'రాష్ట్రంలో టీడీపీ పతనం ఖాయం'



విలేకరుల సమావేశంలో పాల్గొన్న పైలా, శంకరనారాయణ, మెట్టు

రాయదుర్గం: 'రాష్ట్రంలో టీడీపీ శకం ముగిసినట్టే. చంద్రబాబును ప్రజలు విశ్వసించడం లేదు' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ, రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలోని మెట్టు నివాసంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్ అమల్లోకి తెచ్చిన సంక్షేమ పథకాలే గెలుపునకు నాంది పలుకుతాయన్నారు. పార్టీని వీడేవారంతా చెల్లని రూకలుగా మిగిలిపోతారన్నారు. సీఎం జగన్‌తోనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. కుప్పంలో చంద్రబాబు, హిందూపురంలో ఆయన బావమరిది బాలయ్యకు ఓటమి ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో 175కు 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లోనూ ఫ్యాన్ ప్రభంజనం సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి అనంత జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాల్లోనూ భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులంతా గెలవడం ఖాయమన్నారు. సంక్షేమ పథకాలు పొందిన వారంతా మళ్లీ సీఎంగా జగన్‌ను కోరుకుంటారన్నారు. ఈ కారణంగా టీడీపీ అన్ని స్థానాల్లోనూ తుడిచిపెట్టుకు పోతుందని వివరించారు. ప్రతి నియోజకవర్గంలోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సాదరంగా ఆహ్వానం పలుకుతున్నారని చెప్పారు. పొత్తుల్లో భాగంగా చంద్రబాబు ఎవరికీ న్యాయం చేయలేకపోతున్నాడన్నారు. సొంతంగా పోటీచేస్తే జగన్‌ను ఎదుర్కోవడం సాధ్యం కాదని తెలిసే జనసేన, బీజేపీ, ఇతర పార్టీలతో అంటకాగేలా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు మాత్రం క్లియర్ కట్‌గా జగన్ వెంటే నడుస్తారని స్పష్టం చేశారు. ఎన్నికల సంగ్రామంలోకి అడుగు పెట్టామని, శ్రేణులంతా యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగావకాశాల పెంపునకు 'ఓఈఈ' పోర్టల్

- కలెక్టర్ ఎం.గౌతమి



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఉపాధి కల్పనాధికారి కళ్యాణి

అనంతపురం అర్బన్: ''యువతకు ఉద్యోగ అవకాశాలను పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఆన్‌లైన్ ఎంప్లాయింట్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ (ఓఈఈడబ్ల్యూ) పోర్టల్‌ను తీసుకొచ్చింది. దీని ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలను తెలుసుకోవచ్చు.'' అని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. ఆమె గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఓఈఈడబ్ల్యూ పోర్టల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలు, మోడల్ కెరీర్ సెంటర్ల ద్వారా అందే సేవలన్నింటినీ భారత ప్రభుత్వ నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) పోర్టల్‌తో ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ పోర్టల్‌కు అనుసంధానించారన్నారు. గతంలో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో నమోదు చేసుకుంటే సీనియారిటీని బట్టి ఉద్యోగాల భర్తీ జరిగేదన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేసిన వెబ్‌పోర్టల్ యువతకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

సేవలు ఇలా ..

ఆన్‌లైన్ సేవలు (ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యూవల్, అదనపు అర్హతల నమోదు) అన్నీ సులభతీరిన www.employment.ap.gov.in ద్వారా అందుతాయి. అభ్యర్థి తన ఎంప్లాయిమెంట్ కార్డును లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించారు.

ఉద్యోగ సమాచారం తెలుసుకోవచ్చు

ఇంజినీరింగ్, ఎంబీఏ, డిగ్రీ కోర్సులతో సహా ఐటీ, టెక్నికల్ రంగాలకు యువత ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో వారి అభిష్టానికి పెద్దపీట వేస్తూ వెబ్‌పోర్టల్‌ను ప్రభుత్వం రూపొందించిందని జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగం ఏదైనా దానికి సంబంధించిన సమాచారం అధికారికంగా తెలుసుకుని పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల వివరాలు జిల్లాస్థాయి అధికారికి చేరగానే వారి ఆమోదంతో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ నంబర్ తెలియజేస్తారన్నారు.

రైలుకింద పడి రైల్వే ఉద్యోగి మృతి

తాడిపత్రి: రైలులో ప్రయాణిస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన చెందిన అనిల్ బిందు (33) అనే రైల్వే ఉద్యోగి (పాయింట్ మెన్) ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. రైల్వే జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప వివరాలమేరకు.. గుంతకల్ రైల్వేస్టేషన్ పరిధిలో పాయింట్ మెన్‌గా విధులు నిర్వర్తించే అనిల్ బిందు గురువారం రాత్రి తాడిపత్రి నుంచి భార్య భాగ్యదేవత, కుమార్తెతో కలసి గుంతకల్లు వెళ్లేందుకు తాడిపత్రిలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. రైలు జూటూరు దాటగానే వేముల పాడు సమీపంలో రైలు తలుపు వద్ద నిల్చున్న సమయంలో అనిల్ బిందు ప్రమాదవశాత్తూ రైలు నుండి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'ఆరోగ్య సురక్ష'కు స్పందన

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. శుక్రవారం జిల్లాలోని అనంతపురం రూరల్, బెళగుప్ప, గార్లదిన్నె, గుత్తి, గుమ్మఘట్ట, కుందుర్పి, పామిడి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, పుట్లూరు, రాప్తాడు, వజ్రకరూరు, విడపనకల్లు, యల్లనూరు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. 6,314 మంది ఓపీకి హాజరుకాగా వారిలో 2,830 మంది పురుషులు, 3069 మంది మహిళలు ఉన్నారు. స్పెషలిస్టు వైద్యులు 9 మందిని జిల్లా ఆస్పత్రి, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

ఎన్నికల కసరత్తు మొదలాయె

- ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి శిక్షణ
- 8 మంది జిల్లాస్థాయి మాస్టర్ శిక్షకులు
- 73 మంది అసెంబ్లీస్థాయి మాస్టర్ శిక్షకుల నియామకం

అనంతపురం అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ త్వరలో విడుదల కానుంది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణలో భాగంగా ముందస్తుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై జిల్లా ఎన్నికల యంత్రాంగం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి శిక్షణ ప్రక్రియ చేపట్టింది. ఇందు కోసం ప్రత్యేకంగా ఎనిమిది మంది జిల్లాస్థాయి మాస్టర్ శిక్షకులను (డీఎల్‌ఎంటీ), 73 మంది అసెంబ్లీస్థాయి మాస్టర్ శిక్షకులను (ఏఎల్‌ఎంటీ) నియమించింది. డీఎల్‌ఎంటీలు ఎన్నికల నిర్వహణ, ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలపై ఏఎల్‌ఎంటీలకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. వీరంతా నియోజకవర్గస్థాయిలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తారు.

మాస్టర్ శిక్షకులు ఇలా...

జిల్లాస్థాయి మాస్టర్ శిక్షకులుగా తహసీల్దార్లు హరికుమార్, మహబూబ్‌బాషా, మోహన్‌కుమార్, ఉషారాణి, వాణిశ్రీ, ఎంపీడీఓలు ఏవీ శ్రీనివాసులు, డి.ప్రభాకర్, పి.దివాకర్ వ్యవహరిస్తారు. ఇక అసెంబ్లీస్థాయి మాస్టర్ శిక్షకులుగా డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులను మొత్తం 73 మంది నియమించారు.

శిక్షణ అంశాలు : ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సిబ్బందికి శిక్షకులు శిక్షణ ఇస్తారు. ఎవరు ఏ అంశంపై శిక్షణ ఇవ్వాలి అనేది ఇప్పటికే శిక్షకులకు కేటాయించారు. ప్రధానంగా ఎన్నికలకు సంబంధించిన వివిధ కార్యక్రమాలపైన, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ–మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్), ఐటీ అప్లికేషన్లు (సువిధ, సి–విజిల్) తదితర కార్యక్రమాలు, పోస్టల్ బ్యాలెట్, ఇలా పలు అంశాలపై ఎన్నికల సిబ్బందికి మాస్టర్ శిక్షకులు శిక్షణ ఇస్తారు.



ఉరవకొండలో పోలింగ్ బూత్‌లను తనిఖీ చేస్తున్న జేసీ, జెడ్పీ సీఈఓ

మౌలిక వసతులు కల్పించాలి

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌కార్గ్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లోని 45 పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి వసతులపై ఆరా తీశారు. ఉరవకొండలో జేసీ మాట్లాడుతూ ఏఈఆర్‌ఓలు, సెక్టోరియల్ అధికారులు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి అన్ని వసతులు సమకూర్చాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలించేందుకు అనువుగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎక్కువ దూరం ఉండే పోలింగ్ కేంద్రాలు ఎన్ని ఉంటాయో గుర్తించాలన్నారు. ఓటరు జాబితాపై క్లెయిమ్‌లకు సంబంధించిన గడువు నేటితో ముగిసిందన్నారు. అధికారులు ఎన్నికల విధుల్లో పూర్తిగా నిమగ్నం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. ఎక్కడా పొరపాట్లు చోటు చేసుకుకోకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నిడియాదేవి, ఉరవకొండ తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ అమృతరాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన క్రీడాపోటీలు


ఆత్మకూరు జట్టుకు నగదు అందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలో ఆడుదాం- ఆంధ్రా క్రీడాపోటీలు శుక్రవారం ముగిసినట్లు ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు ఉన్నత పాఠశాల్లో క్రీడలు నిర్వహించారు. క్రికెట్‌లో ఆత్మకూరు జట్టు, వాలీబాల్‌లో బి.యాలేరు జట్టు, కబడ్డీలో ఆత్మకూరు జట్టు, బ్యాడ్మింటన్‌లో ఆత్మకూరు జట్టు నియోజకవర్గ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈజట్లు ఈ నెల 24 నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయి క్రీడల్లో పాల్గొంటాయన్నారు. క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నగిరి బాలపోతన్న రూ.10,116ను ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు వన్నూరప్ప, నరసింహులు, పీడీలు జగదీశ్వరయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, నాగరాజు, పీఈటీ గోవర్ధన్ పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం


క్రికెట్ విజేత మరూరు జట్టు

రాప్తాడు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రసన్నాయపల్లిలో వినాయకుమార్ పాఠశాలలో మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు హోరాహోరీగా జరిగాయి. అనంతరం క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీ బాల్ పోటీలు నిర్వహించారు. క్రికెట్‌లో బొమ్మేపర్తి జట్టుపై మరూరు జట్టు, ఖోఖో క్రీడలో ఎం.బండమీదపల్లి జట్టుపై రాప్తాడు జట్టు, కబడ్డీ క్రీడలో ప్రసన్నాయపల్లి జట్టుపై రాప్తాడు జట్టు, వాలీబాల్ క్రీడలో రాప్తాడు జట్టుపై ప్రసన్నాయపల్లి జట్టు గెలిచింది. ఎంపీడీఓ సాల్మన్, ఎంఈఓ మల్లికార్జున, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, సర్పంచు శశికళ, తదితరులు పాల్గొన్నారు.

కందుల కనుగోలు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో రైతులు పండించిన కందులను మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయనున్న నేపథ్యంలో ఆర్‌బీకేల్లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి తెలిపారు. శుక్రవారం స్థానిక రూరల్ వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి (అగ్రి అడ్వైసరీ బోర్డు) సమావేశం నిర్వహించారు. ఏవో సాయిలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏడీఏ ఎం.రవి, అగ్రిబోర్డు చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి, సభ్యులు, ఏఈవోలు, ఆర్‌బీకే అసిస్టెంట్లు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

మార్కెట్లోకి కియా కార్లు


కియా కార్లను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: నగర శివారులోని ఎంజీ బ్రదర్స్ కియా షోరూంలో సెల్టోస్ ఎస్-ట్రీమ్ (ఎక్స్ షోరూం ధర- రూ.19.39 లక్షలు), కరెన్స్ ఎక్స్-లైన్ (ఎక్స్‌షోరూం ధర రూ.18.94 లక్షలు) కార్లను మార్కెట్లోకి విడుదల చేశారు. రెండు మోడల్స్ కార్లు డెలివరీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.కార్యక్రమంలో షోరూం జీఎం ఎల్లప్ప, జనరల్ మేనేజర్ సేల్స్ గిరిప్రసాద్, సేల్స్ మేనేజర్ నేమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక


దాసరి హిమజను సత్కరిస్తున్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి

అనంతపురం: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన అనంతపురం క్రీడాకారిణి దాసరి హిమజ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. గతేడాది నవంబర్ 18 నుంచి 20 వరకు అన్నమయ్య జిల్లా చిట్వేలు మండలం జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని, ఈనెల 17 నుంచి 27 వరకు నిర్వహించనున్న జాతీయ కబడ్డీ క్యాంప్‌లో పాల్గొనుంది. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా రాజంపేటలో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననుంది. హిమజను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి నరసింహా రెడ్డి, కబడ్డీ కోచ్ సంధ్య, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ సుగుణమ్మ అభినందించారు.

సమాన హోదా కల్పించండి

అనంతపురం ఎడ్యుకేషన్: మండలాలకు కేటాయించిన ఇద్దరు ఎంఈఓలకు సమాన హోదా, హక్కులు కల్పించాలని మండల విద్యాధికారులు (ఎంఈఓ-2) కోరారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఈఓ-2లు స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో సమావేశమయ్యారు. ఎంఈఓల సమస్యలపై చర్చించారు. అనంతరం సమస్యలపై విద్యాశాఖ అధికారి, సమగ్రశిక్ష ఏపీసీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెద్దవడుగూరు, బీకేఎస్, నార్పల, పెద్దపప్పూరు, కణేకల్లు, ఆత్మకూరు, శెట్టూరు, అనంతపురం, యాడికి, ఉరవకొండ ఎంఈఓ-2లు గురుప్రసాద్, లింగా నాయక్, ఓబులపతి, భవాని శంకర్, నారపరెడ్డి, రామాంజనేయులు, వాణీదేవి, సరితా రాణి, యాడికి, ఉరవకొండ పాల్గొన్నారు.

పక్షులు కాదు.. పతంగులు


గాలిపటాలను కొనుగోలు చేస్తున్న దృశ్యం



సంక్రాంతి పండుగ అంటే చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా మూడురోజులు సంబరంగా జరుపుకుంటారు. పండుగ వచ్చిందంటే వారం రోజుల ముందుగానే దుకాణాలు పతంగుల విక్రయాలతో కిటకిటలాడుతుంటాయి. కొందరు పతంగులు కొనుగోలు చేస్తే.. మరికొందరు తయారు చేసుకొని గాలిలో సరదాగా ఎగురవేస్తుంటారు. నగరంలోని పలు దుకాణాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా రంగు రంగుల పతంగులు విక్రయాలకు ఉంచడంతో కొనుగోలు దారులతో సందడి నెలకొంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


సాయంకాలం గూటికి చేరుతున్న పక్షి కాదు... చిన్నారులు ఎగురవేసిన గాలి పటం





15 నుంచి రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

అనంతపురం రూరల్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఈ నెల 15 నుంచి రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఏటా ఏ. నారాయణపురంలో దక్ష కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్ ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఏర్పాట్లను శనివారం ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 15న న్యూకేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. మెదటి బహుమతి యూనికాన్ బైక్, రెండో బహుమతి రూ. 70 వేలు అందజేస్తామన్నారు. 16న సీనియర్ వృషభాబాలకు నిర్వహించే పోటీల్లో మెదటి స్థానంలో నిలిచే వృషభాలకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకు, రెండో స్థానంలో నిచినిన వృషభాలకు రూ. 80 వేలు, మూడో స్థానానికి రూ.60 వేలు, నాల్గో బహుమతి కింద రూ. 50 వేలు ఉంటుందన్నారు. గుర్రపుస్వారీ పోటీలు కూడా ఉంటాయన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డి, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి

విజయసాయికి సంఘ మిత్ర అవార్డు


కొమ్మినేని శ్రీనివాసరావు, లక్ష్మీపార్వతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న విజయసాయి

అనంతపురం కల్చరల్: విజయవాడకు చెందిన ఫిలంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియన్, పుడమి అకాడమీ సంయుక్తంగా స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సామాజిక సేవా కార్యకర్త విజయసాయికుమార్‌కు సంఘ మిత్ర అవార్డులు అందించారు. శుక్రవారం ఐలాపురం కన్వెన్షన్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. నగరానికి చెందిన విజయసాయికుమార్‌కు ఏపీ స్టేట్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతీ అవార్డు అందించారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ అంతరాయం

ఆత్మకూరు: మండలంలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

గొరిదిండ్లలో దొంగ ఓట్లు తొలగించండి

ఆత్మకూరు: మండలంలోని గొరిదిండ్లలో దాదాపు 70కి పైగా రెండేసి ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ప్రసాద్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అధికారులు స్పందించి డబుల్ ఓట్లు,దొంగ ఓట్లు పరిశీలించి, వెంటనే వాటిని తొలగించాలన్నారు. కూడేరు మండలానికి సంబంధించిన 14 మంది దొంగ ఓట్లను చేర్చారన్నారు. మాజీ ఎంపీపీ హనుమంతు నాయక్, మాజీ ఎంపీటీసీ నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతన్న మహేష్ పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: పాత పాటల ప్రేమికులు, అనంత సినీ సంగీత కల్చరల్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘంటసాల సంగీత విభావరి ఘనంగా జరిగింది. స్థానిక హౌసింగ్‌బోర్డులోని రాజు చిల్డ్రన్స్‌పార్కులో నూతనంగా ఏర్పాటైన ఘంటసాల స్మారక మండపంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీగాయకులు ఘంటసాల ఆలపించిన మధుర గీతాలను రాగయుక్తంగా ఆలపించారు. గాయకులను నాట్యాచార్యులు సంధ్యామూర్తి, సీనియర్ అడ్వొకేట్ గురుప్రసాద్, ఆచార్య సుధాకర్, సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ సన్మానించారు.

'ఉపాధి'ని సక్రమంగా అమలు చేయాలి

అనంతపురం టౌన్: ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి, అన్ని గ్రామాల్లో వెంటనే పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పెండింగ్ బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డీడబ్ల్యూఎంఏ పీడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా నాయకులు సూరి, భాస్కర్, కృష్ణ, నారాయణ, రంగస్వామి, నాగప్ప, నాగలింగయ్య, కరీమ్, పెద్దయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

బలిజలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఉమ్మడి జిల్లాలో బలిజలు అధికంగా ఉన్నారని, బలిజలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని రాయలసీమ బలిజ మహా సంఘం జిల్లా అధ్యక్షుడు శంకరయ్య కోరారు. శుక్రవారం స్థానిక శ్రీనివాస నగర్‌లోని బాలాజి కల్యాణమంటపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. శంకరయ్య మాట్లాడుతూ అత్యధికంగా ఉన్న బలిజలకు తరతరాల నుంచి అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు బళ్లారి వెంకట్రాముడు, పగడాల మల్లికార్జున, పూల పాండు, తదితరులు పాల్గొన్నారు.

మట్కాబీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం: నగరంలోని వన్‌టౌన్ పరిధిలో మట్కా ఆడుతున్న ఆరుగురిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 11,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రెడ్డెప్ప తెలిపారు.

వీధి బాలల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్

అనంతపురం సిటీ: జిల్లా వ్యాప్తంగా వీధి బాలల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్ ప్రారంభమైందని బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి, ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ వనజాక్షి, కార్మిక శాఖ సహాయ అధికారులు సుజాత తెలిపారు. డీసీపీఓ మలికార్జున, ప్రొటెక్షన్ ఆఫీసర్లు వెంకటేశ్వరి, చంద్రకళ, నర్మద ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్‌ను జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 31 వరకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, బాలల సంక్షేమ సమితి ఉద్యోగులు సమీర్, వసంత, రమాదేవి, నిర్మల, సుహాసిని, వెంకట్‌కుమార్, మల్లికార్జున పాల్గొన్నారు.

జిల్లాకు 2,002 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: రబీ ప్రణాళికలో భాగంగా నెల వారీ కోటా మేరకు వివిధ కంపెనీల నుంచి అన్ని రకాల ఎరువులు జిల్లాకు సరఫరా అవుతున్నట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా జిల్లాకు చేరిన ఎరువులను ఆయన పరిశీలించారు. ఇఫ్కో కంపెనీ నుంచి 2,002 మెట్రిక్ టన్నులు ఎరువులు వచ్చాయన్నారు. అందులో 1,625 మెట్రిక్ టన్నులు డీఏపీ, 377 మెట్రిక్ టన్నులు 20-20-0-13 రకం కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయన్నారు.

భగవంతుడి కృప అపారం

అనంతపురం కల్చరల్: భగవంతుని కృపా కటాక్షాలు అపారమని యేసు కల్వరి ప్రేమ పరిచర్య వ్యవస్థాపకులు రెవరెండ్ జేపీ మధు అన్నారు. మూడు రోజుల పాటూ ఘనంగా జరగనున్న యేసు కల్వరి ప్రేమ మహోత్సవాలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. స్థానిక అరవిందనగర్‌లోని సీఎస్ఐ చర్చిలో జరిగిన వేడుకలకు చెన్నై నుంచి విచ్చేసిన రెవరెండ్ మధు, రెవరెండ్ డాక్టర్ వీణా పి.జెస్సీ వాక్యపరిచర్య చేశారు. సంఘ కాపరి రెవరెండ్ బెన్‌హర్‌బాబు సామూహిక ప్రార్థనలు చేయించారు. జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నెహెమ్యా నాగరాజు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో యువతే కీలకం


నగరపాలక సంస్థ కార్యాలయంలో వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


సెంట్రల్ యూనివర్సిటీలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ కోరి తదితరులు


స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమా

అనంతపురం: దేశ నిర్మాణంలో యువత పాత్రకీలకమని ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వీసీ కోరి పేర్కొన్నారు. శుక్రవారం వివేకానందుడి జయంతి వేడుకలను కేంద్రీయ విశ్వవిద్యాలయంలో నెహ్రూ యువ కేంద్ర సహకారంతో నిర్వహించారు. అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం: శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద జాతీయ యువదినోత్సవ కార్యక్రమాలను ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి. మురళీధర్ రావు,తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. సంస్థ కార్యదర్శి పి. రమ, ఇంతియాజ్ అహమ్మద్, రవికుమార్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


వివేకానంద పార్కులో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శశాంక మౌళి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: స్థానిక అశోక్‌నగర్‌లోని వివేకానంద పార్కులో వివేకానంద యోగ కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు శిక్షణ ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి లక్ష్మణ్, తదితరులు హాజరయ్యారు.

- హెచ్చెల్సీ కాలనీలోని రామకృష్ణ సేవా సమితి కార్యాలయంలో గుత్తి శ్రీధర మూర్తి నేతృత్వంలో సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతపురం కార్పొరేషన్: యువతకు స్ఫూర్తి వివేకానందుడు అని మేయర్ వసీం పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నగరపాలక సంస్థలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

28న ఉచిత వివాహ పరిచయ వేదిక

అనంతపురం కల్చరల్: ఈనెల 28న తిరుపతి నగరంలోని కంచి పీఠంలో జరగనున్న రాష్ట్రస్థాయి వివాహ పరిచయ వేదిక, షష్టిపూర్తి ఉగ్రరతి, సహస్రచంద్ర దర్శనం కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్ఎఫ్‌రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏఎల్ఎన్ శాస్త్రి అధ్యక్షతన బ్రాహ్మణ సంఘం నాయకుల సమావేశం జరిగింది. రాష్ట్ర నాయకులు శేషగిరిరావు, సంకేపల్లి సత్యనారాయణ శర్మ, నార్పల మారుతి తదితరులు మాట్లాడారు. కార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు ముందుగా తమ పేర్లను సెల్: 9490446409, 9440922668లో నమోదు చేసుకోవాలని కోరారు. అంతకుముందు వివాహ వేదిక పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల బ్రాహ్మణ సంఘం నాయకులు సీవీ మురళీధర్, పట్నం విశ్వేశ్వరరావు, లక్ష్మీనరసమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల గ్రామ సభ

ఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించినట్లు ఎస్ఐ జనార్దన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని తోపుదుర్తి, రంగంపేట, సనప గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.



సంప్రదాయం..సంక్రాంతి సంబరం





నగరంలో తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే సంక్రాంతి పండుగను శుక్రవారం ముందస్తుగా నిర్వహించారు. సంక్రాంతి శోభ ఉట్టిపడేలా ముత్యాల ముగ్గులు వేశారు. హరిదాసులతో సందడి చేయించారు. గంగిరెద్దుల మేళం, గోపూజలు చేయించారు. భోగి మంటలు, పాల పొంగులు పెట్టారు. కొత్త పంటల కళకళలు వెరసి సంక్రాంతి పర్వదినాన్ని వైభవంగా జరిపారు. స్థానిక హౌసింగుబోర్డులోని శ్రీ విజయనగర లా కాలేజీలో సంక్రాంతి పండుగను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.రాఘవేంద్రాచార్ అధ్యక్షతన నిర్వహించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఆలూరు రామిరెడ్డి, ఎస్కేయూ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణకుమారి, సీనియర్ న్యాయవాది నామసేవా హరికృష్ణ హాజరై మాట్లాడారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందించారు.

– అనంతపురం / అనంతపురం కల్చరల్:

సమష్టి సహకారంతోనే స్నాతకోత్సవం విజయవంతం

అనంతపురం: బోధన, బోధనేతర, విద్యార్థుల సమష్టి సహకారంతోనే స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించామని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూఏలోని ఆర్యభట్ట ఆడిటోరియంలో డైరెక్టర్లు, విభాగాధిపతులు, కోఆర్డినేటర్లు, వివిధ కమిటీల కన్వీనర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ స్నాతకోత్సవాన్ని విజయవంతం చేసిన జిల్లా అధికార యంత్రాంగానికి, పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, వర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ వి.సుమలత, ప్రొఫెసర్ ఈ. కేశవరెడ్డి, ప్రొఫెసర్ కిరణ్మయి, ప్రొఫెసర్ సి.శోభాబిందు, ప్రొఫెసర్ పద్మ సువర్ణ, ప్రొఫెసర్ ఏ. సురేష్‌బాబు, ప్రొఫెసర్ బి. ఈశ్వర రెడ్డి, ప్రొఫెసర్ ఎస్. విశాలి, ప్రొఫెసర్ పి. సుజాత, ప్రొఫెసర్ వీబీ చిత్ర, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణ కాంతి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ వీసీకి అభినందనలు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అంకితభావంతో విధులు నిర్వర్తించారని పాలకమండలి సభ్యులు ప్రశంసించారు. వీసీ పదవీ కాలం ఈ నెల 17న ముగియనుంది. పాలక మండలి సభ్యులు వీసీని సత్కరించారు. పాలకమండలి సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో వీసీ సంస్కరణలు చేపట్టారన్నారు. వర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారని కొనియాడారు. రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపడం హర్షణీయం

అనంతపురం కల్చరల్: జాతీయ యువజనోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బీవీపీ (భారత్ వికాస్ పరిషత్తు) ఆధ్వర్యంలో 80 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ అందించారు. స్థానిక గీతామందిరంలో పరుచూరు రమేష్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా జడ్జి, పర్మనెంట్ లోక్ అదాలత్ కె.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు రామిరెడ్డి, ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్‌జీ, సుంకు వేణుగోపాల్, సీనియర్ న్యాయవాది నామసేవ హరికృష్ణ పాల్గొన్నారు.


దివ్యాంగులకు కాలీఫర్స్ అందిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

అనంతపురం రూరల్: వెనుకబడిన వడ్డెర్లను ఎస్టీలో జాబితాలో చేర్చే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని భారతీయ వడ్డెర్ల ఐక్యత ఎస్టీ సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు పీట్ల ఆనంద్ కోరారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో నాయకులు డాక్టర్ కుళ్లాయప్ప, ఆంజనేయులు, వడ్డే నాగేష్ మాట్లాడారు.